RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ | సంపుటి : 20 | సంచిక : 286 | పబ్లిషర్ : కొక్కు రవికుమార్ | గురువారం 3 - 9 - 2026 | పేజీలు : 4 | వెల : రూ. 1 - 00

### ప్రజా వ్యతిరేక విధానాలతో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన: కవిత

**హైదరాబాద్,సెప్టెంబర్,02:**కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వెయ్యి రోజుల కాలం పూర్తిగా ప్రజావ్యతిరేక విధానాలు, నెరవేర్చని హామీలతోనే సాగిందని ఆమెధ్వజమెత్తారు. వరుసగా మరణించడం, జాబ్ నోటిఫికేషన్లు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవడం, పంటలకు మద్దతు ధర లేక అన్నదాతల బలవన్మరణాలు పెరిగిపోవడ ం.. వీటికి తోడు రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి నేరాలు నిత్యకృత్యం కావడమే ఈప్రభుత్వం సాధించిన అసలైన 'ప్రగతి' అని ఎద్దేవా చేశారు.

### వాహనం డ్రైవర్ సీటు కింద రూ.1.44 కోట్ల నగదు.. స్వాధీనం చేసుకున్న పోలీసులు

తిరువనంతపురం: అంతరాష్ట్ర సరిహద్దులో ఒక వాహనాన్ని పోలీసులు తనిఖీచేశారు. డ్రైవర్ సీటు కింద రహస్యంగా దాచిన రూ. 1.44 కోట్ల నగదు గుర్తించారు. ఆడబ్బును స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనంలో ఉన్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఆ డబ్బు గురించి వారిని ప్రశ్నిస్తున్నారు. కేరళలోని వయనాడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కేరళ–కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన తోల్పట్టి వద్ద తిరునెల్లి పోలీసులు, ఆ జిల్లా మాదకద్రవ్యాల నిరోధక ప్రత్యేక బృందం సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కర్ణాటక నుంచి వస్తున్న ఒక వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. డ్రైవర్ సీటు కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలో దాచిన నగదు కట్టలు చూసి పోలీసులు షాక్ అయ్యారు.

### రైతులు, టీచర్లపై కేసుల్ని

## ఎత్తేసిన తమిళనాడు సర్కార్..



**చెన్నై,,సెప్టెంబర్,02:**తమిళనాడు సీఎం విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రైతులు, ఉపాధ్యాయులపై ఉన్న కేసుల్ని ఎత్తేశారు. జీవనోపాధి, హక్కులు, న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా చేపట్టిన ఆందోళనలకు సంబంధించి 2021 మే నుంచి 2026 ఏప్రిల్ మధ్య నమోదైన అన్ని కేసులను ఉపసంహరించుకుంటున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ బుధవారం అసెంబ్లీలో ప్రకటించారు. మానవతా దృక్పథంతో పాటు ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. గత ప్రభుత్వం రైతులు, టీచర్లపై అనేక కేసులు నమోదు చేసిందని విజయ్ విమర్శించారు. వారి ప్రజాస్వామ్య హక్కులు హరించబడ్డాయని, కేసుల కారణంగా ఇప్పటికే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు, టీచర్ల న్యాయమైన డిమాండ్లకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తిరువణ్ణామలై జిల్లాలో పారిశ్రామిక ఎస్టేట్‌కు వ్యతిరేకంగా రైతులు నిర్వహించిన ఆందోళనల్ని విజయ్ ప్రశ్నించారు. ఈ నిరసనల్లో కొందరు రైతులపై గుండాస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారని చెప్పారు. పరందూర్‌లో ప్రతిపాదిత విమానాశ్రయానికి వ్యతిరేకంగా రైతులు చేసిన ఆందోళనల కేసులను కూడా ఉపసంహరిస్తామని విజయ్ ప్రకటించారు. విమానాశ్రయం కారణంగా వ్యవసాయ భూములు, నీటి వనరులు, జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ కేసుల ఉపసంహరణ ప్రజాస్వామ్య హక్కులపై మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలుకు, ప్రభుత్వానికి మధ్య నమ్మకాన్ని పెంచుతుందని విజయ్ అన్నారు.

### పౌరసత్వంపై ట్రంప్ కఠిన వైఖరి

## పిల్లల పాస్‌పోర్ట్‌కు తల్లిదండ్రుల పౌరసత్వం




**న్యూఢిల్లీ,సెప్టెంబర్,02:**అమెరికాలో జన్మహక్కు పౌరసత్వాన్ని పరిమితం చేసే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మరో కీలక ప్రతిపాదనను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇకపై అమెరికాలో జన్మించిన పిల్లలకు పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసేటప్పుడు.. తల్లిదండ్రులు తమ పౌరసత్వం లేదా ఇమ్మిగ్రేషన్ హోదాకు సంబంధించిన ఆధారాలను సమర్పించాల్సి రావొచ్చు. రాయిటర్స్ నివేదిక ప్రకారం.. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ ప్రతిపాదన రూపొందిస్తున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం అమెరికాలో పుట్టిన పిల్లలకు పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసే తల్లిదండ్రులు.. తమకు, చిన్నారికి మధ్య ఉన్న సంబంధాన్ని నిరూపించడంతో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డును సమర్పించాలి. దరఖాస్తు ఫారంలో తల్లిదండ్రుల పౌరసత్వ హోదాను కూడా వెల్లడించాలి. అయితే తమ ఇమ్మిగ్రేషన్ స్థితిని నిరూపించే పత్రాలను సాధారణంగా సమర్పించాల్సిన అవసరం లేదు. అయితే ట్రంప్ ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా మార్గదర్శకాల ప్రకారం ఈ విధానంలో మార్పులు చేయాలని భావిస్తోంది. పిల్లవాడు ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పరిధిలోకి వస్తాడా లేదా అనే విషయాన్ని నిర్ణయించేందుకు తల్లిదండ్రుల వివరాలతో పాటు వారి పౌరసత్వం లేదా ఇమ్మిగ్రేషన్ హోదాకు సంబంధించిన ఆధారాలను కూడా సేకరించాలని ప్రతిపాదించింది.

## హైదరాబాద్‌లో ఆ భూముల ధరలకు రెక్కలు..



హైదరాబాద్,సెప్టెంబర్ 2: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ)లో హౌసింగ్ బోర్డు భూములకు భారీ డిమాండ్ వచ్చింది. కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లోబుధవారం నిర్వహించిన బహిరంగ వేలంలో 16 ఎంఐజీ ఓపెన్ ప్లాట్లు రికార్డు ధరలకు అమ్ముడయ్యాయి. ఈ వేలంలో గజం భూమి గరిష్ఠంగా రూ. 2.70 లక్షలకు విక్రయించడం హాట్‌టాపిక్‌గా మారింది. హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాల్లో భూముల ధరలుఏ స్థాయిలో ఉన్నాయో మరోసారి స్పష్టం చేసింది. అధికారులు నిర్వహించిన ఈ బహిరంగ వేలంలో ఒక్కో గజానికి కనీస ధరను రూ. 1.60 లక్షలుగా నిర్ణయించగా,వేలంలో పలువురు బిడ్డర్లు పోటీ పడటంతో ధరలు గణనీయంగాపెరిగాయి. అత్యధికంగా ఒక ప్లాట్ గజం రూ. 2.70లక్షలకు అమ్ముడైంది. మరో ప్లాట్ గజంరూ. 2.36 లక్షలకు విక్రయించారు. అదేవిధంగా మరో రెండు ప్లాట్లు గజం రూ. 2.06 లక్షల చొప్పున అమ్ముడ య్యాయి. ఈ వేలంలోమొత్తం 19 మందిబిడ్డర్లు ఉత్సాహంగా పాల్గొని ప్లాట్ల కోసం పోటీపడ్డారు. ఈ పోటీ కారణంగా హౌసింగ్ బోర్డు నిర్దేశించిన కనీస ధర కంటే అనేక ప్లాట్లు అధిక ధరలకు విక్రయమయ్యాయి. మొత్తం 16 ప్లాట్ల విక్రయం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ. 47.14కోట్ల ఆదాయం సమకూరింది. వేలంలో గజం సగటు ధర రూ. 1.79 లక్షలుగా నమోదైంది.

## రామమందిర ట్రస్ట్ మొట్టమొదటి సీఈవోగా ఎయిర్ మార్షల్



**లక్నో,సెప్టెంబర్,02:**రామమందిర ట్రస్ట్ మొట్టమొదటి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) జితేంద్ర మిశ్రా ఎంపికయ్యారు. భారత వైమానిక దళంలో పలు కీలకమైన కమాండింగ్ బాధ్యతలు నిర్వహించిన ఈ మాజీ అధికారి, 'ఆపరేషన్ సింధూర్' సమయంలో వెస్ట్రన్ కమాండ్ అధిపతిగా వ్యవహరించారు. అయోధ్య విరాళాల చోరీకి సంబంధించిన వివాదంతో తీవ్రంగా దెబ్బతిన్న ఆలయ నిర్వహణ, ఆర్థిక జవాబుదారీతనాన్ని పటిష్టం చేయాల్సిన కీలక బాధ్యత ఇప్పుడు ఆయనపై ఉంది. ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) మిశ్రా 1986 డిసెంబర్‌లో భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా నియమితులయ్యారు. 38 ఏళ్లకు పైగా సేవలందించిన అనంతరం, ఆయన 2026 మేలో భారత వైమానిక దళం నుండి పదవీ విరమణ చేశారు. ఆయన పూణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ, బెంగళూరులోని ఎయిర్ ఫోర్స్ టెస్ట్ పైలట్స్ స్కూల్, అమెరికాలోని ఎయిర్ కమాండ్ అండ్ స్టాఫ్ కాలేజ్, యూకేలోని రాయల్ కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ పూర్వ విద్యార్థి.

### ఆ విమానాశ్రయాల

## పనులు వేగవంతం చేయండి

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్



ఢిల్లీ, సెప్టెంబర్ 2 : కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. తెలంగాణలో ఆదిలాబాద్, మామూనురు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని కోరారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని కేంద్రమంత్రికి.. సీఎం రేవంత్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రన్ వే ఫైనలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ వెల్లడించారు. ఆ పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని రామ్మోహన్ తెలిపారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌కు.. సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు.

హెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీనామా కోరలేదు..

### అధిష్ఠానం నిర్ణయం కోసం వేచి చూస్తున్నా

### మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కొండా సురేఖ




**న్యూఢిల్లీ,సెప్టెంబర్,02:** కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో ఢిల్లీకి వెళ్లిన మంత్రి కొండా సురేఖ.. పలువురు పార్టీ పెద్దలతో భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సురేఖ మాట్లాడుతూ.. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశానని.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదని అన్నారు. అధిష్ఠానం ఏం చేస్తుందో వేచిచూస్తున్నట్లు తెలిపారు.

రాజీనామా చేయాలని తనను కోరలేదని చెప్పారు. బీసీ అయిన తనకు ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయం పాటిస్తారా అని కొండా సురేఖ ప్రశ్నించారు. కేబినెట్‌లో ఉన్న ఇతర సామాజికవర్గాల నేతలపై పెద్దఎత్తున అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. వాటన్నింటికీ ఏం సమాధానం చెబుతారని.. ఎలాంటి చర్యలు తీసుకుంటారని అడిగారు. అన్ని అంశాలపై ఇప్పటికే ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా అధిష్ఠాన పెద్దలందరికీ రాతపూర్వకంగా తెలియజేసినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌పై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదేళ్లు తానే సీఎం అని రేవంత్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకోవాలని ఖర్గేకు చెప్పినట్లు మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

### 22ఎ భూములపై అసెంబ్లీలో

## ఏం మాట్లాడతారో రండి..

### బీఆర్ఎస్‌కి పొంగులేటి సవాల్



హైదరాబాద్,సెప్టెంబర్ 2 : 22ఎ భూములపై అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్ నేతలు సభలో ఏం మాట్లాడతారో మాట్లాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ చేశారు. 22ఎ భూములను అడ్డుపెట్టుకుని దందాలు చేస్తామంటే కుదరదని హెచ్చరించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రతిపక్ష పాత్రను విస్మరించాయని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వెయ్యి రోజులు పూర్తి చేసుకుందని తెలిపారు. కేసీఆర్ హయాంలో రూ. 8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని ధ్వజమెత్తారు బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిట్‌చాట్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, పెట్టిన బకాయిలు తాము చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు. యాస, భాషలతో ప్రజలను మభ్య పెట్టలేరని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ బకాయిలను తామే చెల్లించామని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో సర్పంచ్‌లకు పెట్టిన బకాయిలను కూడా తామే చెల్లించామని పేర్కొన్నారు. 'మా పాలనలోని వెయ్యి రోజుల్లో రూ. 1.76లక్షల కోట్లను రైతులకు ఇచ్చాం. ఆనాడు వరి వేస్తే ఉరిఅని కేసీఆర్ అన్నారు.. మేము వరికి క్వింటాకు రూ. 500 బోనస్ ఇచ్చాం. ప్రజలను కావాలని మా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారు.

## భారత్-అమెరికా మధ్య వాణిజ్య బంధం

### ఈ నెలాఖరులో అమెరికాకు పీయూష్ గోయల్!



**న్యూఢిల్లీ,సెప్టెంబర్,02:**భారత్–అమెరికా దేశాలు న్యాయమైన, పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య సంబంధాన్ని నిర్మించేందుకు సన్నిహితంగా పనిచేస్తున్నాయని భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య అవగాహనపై ఇప్పటికే గణనీయమైన పురోగతి సాధించామని వెల్లడించారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఈ నెలాఖరులో అమెరికా పర్యటనకు వెళ్లనున్నారని ఆయన తెలిపారు. ఆటోమోటివ్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 66వ వార్షిక సమావేశంలో సెర్గియో గోర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత్–అమెరికా వాణిజ్య సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. "న్యాయమైన, పరస్పర ఇరు దేశాలకు ప్రయోజనం చేకూర్చే వాణిజ్య సంబంధాన్ని నిర్మించేందుకు మా రెండు ప్రభుత్వాలు సన్నిహితంగా కలిసి పనిచేస్తున్నాయి. ఇది ఇంకా అధికారికంగా ప్రకటించారా లేదా నాకు తెలియదు. కానీ మంత్రి పీయూష్ గోయల్ ఈ నెలాఖరులో అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. జీ20 చర్చల నేపథ్యంలో అమెరికాతో చర్చలను కొనసాగిస్తారు" అని సెర్గియో గోర్ పేర్కొన్నారు. ఇరు దేశాల ప్రభుత్వాలు ఇప్పటికే కుదుర్చుకున్న వాణిజ్య అవగాహనతో పాటు పలు అంశాల్లో వాస్తవమైన పురోగతి సాధించామని తెలిపారు. భారత్–అమెరికా మధ్య పురోగతి కేవలం వస్తువుల వాణిజ్యానికి మాత్రమే పరిమితం కాలేదని గోర్ అన్నారు. ఇరు దేశాలు దాదాపు అన్ని రంగాల్లో కలిసి పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది భారత్, అమెరికా 'ఖుషీ గాఅశ్రీఅమ్ఖు' డిక్లరేషన్‌పై సంతకం చేశాయని తెలిపారు. ఆవిష్కరణలకు అనుకూలమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా ఇది కీలక ముందడుగు అని చెప్పారు. ఈ డిక్లరేషన్ వల్ల భారత్–అమెరికా కంపెనీలు పరస్పరం సరిహద్దులు దాటి పెట్టుబడులు పెట్టుకోవడం సులభతరం అవుతుందని గోర్ వివరించారు. అలాగే ఇరు దేశాల్లోని కొత్త తరం పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని తెలిపారు. భారత్–అమెరికా సంబంధాలు వాణిజ్యానికి మించి సాంకేతికత, పెట్టుబడులు, ఆవిష్కరణలు తదితర రంగాల్లో మరింత విస్తరిస్తున్నాయని సెర్గియో గోర్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

## యుద్ధ అంచున ప్రపంచం

పశ్చిమాసియాలో మళ్లీ సంగ్రామ మేఘాలు కమ్ముకొంటున్నాయి. "ఆపరేషన్ ఎపిక్ ఫూరీ" పేరుతో కొనసాగుతున్న అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త సైనిక చర్యలు, వాటికి ప్రతిస్పందనగా ఇరాన్ చేసిన ప్రతిఘటన ప్రకటనలు, ఐక్యరాజ్య సమితి భద్రతామండలి అత్యవసర సమావేశం ఈ సమస్త పరిణామాలు ప్రపంచ రాజకీయ రంగాన్ని కుదిపేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశ రక్షణకు ముప్పు కలిగించే శక్తులను అడ్డుకోవడంలో వెనుకాడబోమని స్పష్టం చేయగా, ఇరాన్ విదేశాంగ మంత్రి హ్సస్సేన్ అమీరాబాద్ డొల్లాహియన్ తమ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడంలో ఎటువంటి రాజీ ఉండదని ఘాటుగా ప్రకటించారు. మాటల స్థాయిలో ప్రారంభమైన ఈ ప్రతిస్పందనలు క్రమంగా సైనిక కదలికల రూపంలోనూ వ్యక్తమవుతున్నాయి. ఈ ఉద్రిక్తతకు ప్రధాన కారణంగా ఇరాన్ అణు కార్యక్రమాన్ని అమెరికా, ఇజ్రాయిల్ పేర్కొంటున్నాయి. 2015 సంవత్సరంలో కుదిరిన ఉమ్మడి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ఒప్పందం ప్రకారం ఇరాన్ అణు శక్తి అభివృద్ధిని నియంత్రించేందుకు అంతర్జాతీయ పర్యవేక్షణకు అంగీకరించింది. అయితే ఆ ఒప్పందం నుంచి అమెరికా వైదొలిగిన తర్వాత అనుమానాలు మళ్లీ పెరిగాయి. ఇరాన్ యురేనియం శుద్ధీకరణ స్థాయిని పెంచుతోందన్న ఆరోపణలతో ఇజ్రాయిల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తమ భద్రతకు ప్రత్యక్ష ముప్పు ఏర్పడుతుందనే భావనతో ఇజ్రాయిల్ ఇరాన్‌లోని కొన్ని అణు కేంద్రాలపై గగనతల దాడులు నిర్వహించినట్లు వార్తలు వెలువడ్డాయి. అమెరికా కూడా ఈ చర్యలకు మద్దతు తెలుపుతున్నదనే అభిప్రాయం బలపడుతోంది. ఇరాన్ మాత్రం తన అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాలకేనని, విద్యుత్ ఉత్పత్తి మరియు శాస్త్రీయ పరిశోధనల కోసమేనని స్పష్టం చేస్తోంది. అంతర్జాతీయ అణుశక్తి పర్యవేక్షణ సంస్థ పర్యవేక్షణలోనే తమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొంటోంది. అయితే ఇజ్రాయిల్ దృష్టిలో ఇరాన్ అణు సామర్థ్యం భవిష్యత్తులో ప్రాణాంతక ముప్పుగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అమెరికా?ఇజ్రాయిల్ చర్యలు రక్షణాత్మక చర్యలేనని వారు వాదిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించి తక్షణ సంగ్రామ విరమణకు పిలుపునిచ్చింది. చర్చల ద్వారానే సమస్య పరిష్కారం సాధ్యమని సభ్యదేశాలు అభిప్రాయపడ్డాయి. రష్యా, చైనా వంటి దేశాలు ఈ దాడులను తీవ్రంగా ఖండించగా, యూరోపియన్ దేశాలు పరిస్థితి అదుపు తప్పకూడదని హెచ్చరించాయి. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి శాంతి సాధనకే ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాల మధ్య ఉన్న విభేదాలు ఏకాభిప్రాయ నిర్ణయానికి అడ్డంకిగా నిలుస్తున్నాయి. గల్ఫ్ ప్రాంత దేశాలు అత్యవసరంగా సమావేశ మవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియ జేస్తోంది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్, కువైట్ వంటి దేశాలు తమ భూభాగం సంగ్రామ రంగంగా మారుతుందేమోనని ఆందోళన చెందుతున్నాయి. హోర్ముజ్ సముద్ర మార్గం ప్రపంచ చమురు రవాణాకు కీలక జీవనాధారం. ప్రపంచ చమురు సరఫరాలో పెద్ద భాగం ఈ మార్గం ద్వారా సాగుతుందని అంచనాలు చెబుతున్నాయి. అక్కడ సైనిక ఘర్షణలు ఉద్ధృతమైతే ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. ఇప్పటికే చమురు ధరల్లో పెరుగుదల సూచనలు కనిపిస్తున్నాయి. జర్మనీ, బ్రిటన్ వంటి దేశాలు అమెరికాకు మద్దతుగా నిలిచే అవకాశమున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే ప్రత్యక్ష సైనిక ప్రవేశంపై యూరోపియన్ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మరోవైపు రష్యా, చైనా ఈ దాడులను ఆధిపత్య రాజకీయాల ప్రతిబింబంగా విమర్శిస్తున్నాయి. ఉక్రెయిన్ సంగ్రామం కారణంగా ఇప్పటికే పాశ్చాత్య దేశాలతో విభేదాలు ఉన్న రష్యా, ఈ సందర్భాన్ని వ్యూహాత్మకంగా వినియోగించుకునే అవకాశముంది. మూడవ ప్రపంచ సంగ్రామం సంభవిస్తుందా అన్న ప్రశ్న ఇప్పుడు గంభీరంగా వినిపిస్తోంది. ఒకవేళ అమెరికా?ఇజ్రాయిల్? యూరోపియన్ దేశాలు ఒకవైపు, ఇరాన్‌కు మద్దతుగా రష్యా?చైనా మరోవైపు నిలిస్తే ప్రపంచం రెండు శిబిరాలుగా విడిపోయే ప్రమాదం ఉంది. ఆధునిక సంగ్రామ స్వరూపం కేవలం భూయుద్ధంతో పరిమితం కాదు. క్షిపణి దాడులు, మానవ రహిత యంత్ర వాహనాల వినియోగం, సమాచార యుద్ధం, ఉపగ్రహ వ్యవస్థల విధ్వంసం, ఆర్థిక ఆంక్షలు?ఇవన్నీ సమాంతరంగా జరుగుతాయి. అణు ఆయుధాల వినియోగం అనే భయానక అంశం ప్రపంచాన్ని కుదిపేస్తోంది. అణు సంగ్రామం జరిగితే మానవజాతి, పర్యావరణం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తిరుగులేని నష్టం సంభవిస్తుంది. ప్రపంచ ఇంధన మార్కెట్లపై ఈ సంగ్రామ ప్రభావం అత్యంత తీవ్రమైనదిగా ఉంటుంది. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం, ఉత్పత్తి వ్యయం పెరుగుతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు ఎదుర్కొంటాయి. అంతర్జాతీయ వాణిజ్యం మందగిస్తుంది. మూలధన ప్రవాహాలు క్షీణిస్తాయి. ఈ ప్రభావాలు సంగ్రామంలో ప్రత్యక్షంగా పాల్గొనని దేశాలకూ తాకుతాయి. భారత దేశానికి ఈ సంక్షోభం నుంచి మినహాయింపు ఉండదు. భారత్ తన చమురు అవసరాల్లో గల్ఫ్ దేశాలపై ఎక్కువగా ఆధార పడుతోంది. చమురు ధరల పెరుగుదల భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతుంది. విదేశీ మారక నిల్వల వినియోగం పెరుగుతుంది. గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న లక్షలాది భారతీయుల భద్రత ప్రశ్నార్థక మవుతుంది. అవసరమైతే వారిని సురక్షితంగా తరలించాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు. ఎరువులు, సహజ వాయువు, పెట్రో ధరలను రసాయనాల సరఫరాపై కూడా ప్రభావం పడుతుంది. ఇరాన్ అంతర్గత పరిస్థితులు కూడా ఈ సంగ్రామ వాతావరణంతో సంక్లిష్టంగా మారుతున్నాయి. ఆర్థిక ఆంక్షలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశానికి సైనిక ఒత్తిడి మరింత భారంగా మారుతుంది. అయితే విదేశీ దాడులు దేశంలో జాతీయత భావాన్ని పెంచి ప్రభుత్వానికి మద్దతు కూడగట్టే అవకాశమూ ఉంది.

పబ్లిషర్ : కొక్కు రవికుమార్

# ఫీజు వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలి



చెన్నై : తమిళనాడులోని అన్ని ప్రయివేట్ పాఠశాలలు తమ ఫీజుల వివరాలను నోటీసు బోర్డులు, వెబ్‌సైట్లలో తప్పనిసరిగా ప్రదర్శించాలని మద్రాస్ హైకోర్టు బుధవారం ఆదేశించింది. ప్రభుత్వం నియమించిన ఫీజు నిర్ధారణ కమిటీ ద్వారా నిర్ధారించబడిన ఫీజుల వివరాలను అన్ని ప్రయి వేట్ పాఠశాలలు తమ నోటీసు బోర్డులు, వెబ్‌సైట్లలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేలా ప్రయివేట్ పాఠశాలల డైరెక్టర్ తనిఖీ చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. తమిళనాడు ప్రయివేట్ పాఠశాలల (నియంత్రణ) చట్టం 2019 పరిధిలోకి వచ్చే అన్ని పాఠశాలలు ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని కమిటీ నిర్ధారించిన ఫీజులతో పాటు, సంబంధిత అధికార సంస్థ ఆమోదించిన ఇతర ఫీజులను కూడా ప్రదర్శించాలని హైకోర్టు పేర్కొంది. చెన్నైకి చెందిన ఆల్ ఇండియా ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అసోసియేషన్ (ఏటీఎస్ఐసీ) ప్రధాన కార్యదర్శి కె. పళనియప్పన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఈ మేరకు తీర్పు ఇచ్చింది. నిజానికి ఈ పిటిషన్ అన్ని ప్రయివేటు పాఠశాలలు తమ నోటీసు బోర్డులపై ఫీజుల వివరాలను ప్రదర్శించడాన్ని తప్పనిసరి చేస్తూ ప్రయివేట్ పాఠశాలల డైరెక్టర్ జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలయింది. ప్రయివేట్ అన్‌ఎయిడెడ్ విద్యా సంస్థలకు సర్క్యులర్ వర్తించదని ఈ పిటిషన్ వాదించింది. రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వాల నుంచి గణనీయమైన ఆర్థిక సహాయం లేదా నియంత్రణలేని ప్రయివేట్ విద్యా సంస్థలు 'పబ్లిక్ అథారిటీ' పరిధిలోకి రావనే అసోసియేషన్ వాదనతో హైకోర్టు కూడా ఏకీభవించింది. అయినప్పటికీ, ప్రయివేట్ పాఠశాలలు రాష్ట్ర శాసనసభ ఆమోదించిన చట్టం పరిధిలోకి వస్తాయని పేర్కొంటూ, పాఠశాలలు తమ ఫీజుల వివరాలను బహిరంగపరచడానికి కట్టుబడి ఉండాలని చెబుతూ, తన అసాధారణ అధికార పరిధిని ఉపయోగించి హైకోర్టు ఈ తీర్పు ఇచ్చింది. తమ పిల్లల కోసం మంచి పాఠశాలను ఎంచుకోవాలనుకునే తల్లిదండ్రులు, ఆయా పాఠశాలలు వసూలు చేసే ఫీజుల వివరాలను పారదర్శకంగా తెలుసుకోగలగాలని, తద్వారా వారు సరైన నిర్ణయం తీసుకోగలరని హైకోర్టు వ్యాఖ్యానించింది. అలాగే పిల్లలను చేర్పించిన తర్వాత ఆర్థికంగా ఇబ్బంది పడే పరిస్థితిని నివారించుకోగలరని హైకోర్టు పేర్కొంది.

# రష్యా రిఫైనరీపై ఉక్రెయిన్ దాడి...

రష్యాలోని ఒమ్స్క్ నగరంలో ఉన్న అతి పెద్ద చమురు శుద్ధి కర్మాగారంపై ఉక్రెయిన్ డ్రోన్లను ప్రయోగించింది. ఇది సైబీరియాలోని మారుమూల ప్రాంతంలో ఉంది. ఈ దాడి కారణంగా ఉక్రెయిన్ అధీనంలో ఉన్న భూభాగం నుంచి సుమారు 2,700 కిలోమీటర్ల దూరంలో, కజకిస్తాన్‌తో రష్యా సరిహద్దుకు సమీపంలో ఉన్న ఓమ్స్క్ రిఫైనరీలో అగ్నిప్రమాదం సంభవించింది. ఉక్రెయిన్ దాడిని ఓమ్స్క్ గవర్నర్ విటాలీ ఖొట్సెంకో ధృవీకరించారు. దాడిలో ఉక్రెయిన్ ప్రయోగించిన అనేక డ్రోన్లను రష్యా గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని ఆయన చెప్పారు. ఈ దాడిలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, అత్యవసర సేవల సిబ్బంది సహాయ కార్యక్రమాలలో నిమగ్నమయ్యారని అధికారులు తెలిపారు. ఆస్తినష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఈ దాడి ఉక్రెయిన్ సాయుధ దళాలకు లభించిన ముఖ్యమైన విజయంగా దేశాధ్యక్షుడు జెలెన్స్కీ అభివర్ణించారు. సైబీరియా కూడా ఇప్పుడు ఉక్రెయిన్ దాడుల పరిధిలోకి వచ్చిందని చెప్పారు. కాగా తాము ఆధునీకరించిన ఎఫ్‌పీ'1 డ్రోన్లుఈ దాడులు నిర్వహించాయని, ఇవి ఉక్రెయిన్ లోనే కాక ప్రపంచవ్యాప్తంగా స్ట్రయిక్ డ్రోన్లకు ఓ రికార్డు అని రక్షణ సాంకేతిక సంస్థ ఫైర్ పాయింట్ తెలిపింది. ఈ దాడికి ముందు ఓమ్స్క్ చమురు రిఫైనరీ ఉక్రెయిన్ డ్రోన్ల పరిధిలోకి రాలేదు. ఇప్పటి వరకూ



రష్యాలోని టాప్-10 చమురు రిఫైనరీలలో రెండు మాత్రమే ఉక్రెయిన్ దాడులను తప్పించుకున్నాయి. వాటిలో ఓమ్స్క్ ఒకటి. యురల్ పర్వతాలకు ఆవల అంగార్స్క్ పెట్రోకెమికల్ కంపెనీకి చెందిన చమురు శుద్ధి కర్మాగారం కూడా ఉక్రెయిన్ దాడులకు గురికాలేదు. తాజాగా దాడికి గురైన ఓమ్స్క్ కూడా యురల్ పర్వతాల ఆవలే ఉంది. ఓమ్స్క్ రిఫైనరీ గత సంవత్సరం 23 మిలియన్ మెట్రిక్ టన్నులను ప్రాసెస్ చేసింది. ఇది రోజుకు 4,60,000 బ్యారల్స్‌కు సమానం.

# పక్క చూపులు చూస్తున్న కన్నబాబు


**విశాఖపట్టణం,** : అనకాపల్లి జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా గుర్తింపు పొందిన మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు వ్యవహారశైలి ఇటీవల మరోసారి చర్చనీయాంశంగా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉంటుండటం, పార్టీ ముఖ్యమైన నిరసన కార్యక్రమాల్లో కూడా కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో పలు ఊహాగానాలకు కారణమవుతోంది. దీంతో ఆయన పార్టీతో కొనసాగుతున్నారా, లేక రాజకీయంగా కొత్త నిర్ణయాల వైపు అడుగులు వేస్తున్నారా అనే చర్చ సాగుతోంది. ఇటీవల ఎలమంచిలి నియోజకవర్గంలోని పంచదార్ల ప్రాంతంలో అక్రమ మైనింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులు హాజరయ్యారు. అయితే మూడు సార్లు ఎలమంచిలి ఎమ్మెల్యేగా పనిచేసిన కన్నబాబురాజు ఈ కార్యక్రమంలో కనిపించకపోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కన్నబాబురాజు గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో పెద్దగా చురుకుగా పాల్గొనడం లేదని స్థానిక రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఆయన పుట్టినరోజు వేడుకల సందర్భంగా కూడా పార్టీ నాయకుల హడావుడి కనిపించకపోవడం ఈ చర్చలకు మరింత బలం చేకూర్చింది. అయితే ఇది ఆయన రాజకీయ వ్యూహంలో భాగమని భావిస్తున్నవారూ ఉన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించిన కన్నబాబురాజు, 2024 ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. ఎన్నికల అనంతరం కొంతకాలం పాటు పార్టీ ఆయననే నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగించింది. అయితే తరువాత పార్టీ అధిష్ఠానం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కి ఆ బాధ్యతలు అప్పగించింది. ఈ నిర్ణయం తర్వాత కన్నబాబురాజు అసంతృప్తికి గురయ్యారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపించింది. ఎలమంచిలి నియోజకవర్గంలో ప్రస్తుతం పార్టీకి చెందిన రెండు వర్గాలు విడివిడిగా పనిచేస్తున్నాయని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఒకవైపు కరణం ధర్మశ్రీ వర్గం కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, మరోవైపు కన్నబాబురాజు అనుచరులు కూడా



తమకంటూ ప్రత్యేకంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఈ పరిస్థితి భవిష్యత్‌లో టికెట్ కోసం పోటీకి సంకేతంగా భావిస్తున్నారు. మరోవైపు, వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ సుకుమార్ వర్మ (కు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించేందుకు కన్నబాబురాజు ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. భవిష్యత్ రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఆయన ప్రస్తుతం మౌన వ్యూహాన్ని అనుసరిస్తున్నారని కొందరు విశ్లేషిస్తున్నారు. అయితే కన్నబాబురాజు ఇప్పటివరకు పార్టీని వీడుతున్నట్లు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కూడా ఆయనపై బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అయినప్పటికీ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం, స్థానిక రాజకీయ పరిణామాల్లో మౌనం పాటించడం వంటి అంశాలు ఆయన భవిష్యత్ రాజకీయ అడుగులపై ఆసక్తిని పెంచుతున్నాయి. రానున్న రోజుల్లో ఎలమంచిలి నియోజకవర్గ రాజకీయాలు ఎలా మారతాయి, కన్నబాబురాజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతారా లేదా కొత్త రాజకీయ నిర్ణయం తీసుకుంటారా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఆయన తదుపరి నిర్ణయం స్థానిక రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు.

# గోదావరి జిల్లాల్లో ఎవరి లెక్కలు వారివి

**కాకినాడ:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు గుండెకాయ లాంటి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అధికార కూటమి పచ్చని సంసారంలో స్థానిక సంస్థల ఎన్నికల సెగలు రేపుతోంది. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మధ్య మైత్రి ఫెవికాల్ బంధంలా అత్యంత బలంగా కనిపిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయికి వచ్చేసరికి సీన్ పూర్తిగా మారుతోంది. సార్వత్రిక ఎన్నికల నాటి త్యాగాలు, సర్దుబాట్లు ఒకెత్తయితే.. ఇప్పుడు ముంచుకొస్తున్న స్థానిక సంస్థల సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వేళ ఏ గ్రామానికి ఆ గ్రామంలో సీట్ల పంచాయితీ ముదిరిపాకాన పడుతోంది. పొత్తుల రొంపిలో ఇరు పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు, అటు తమ్ముళ్లు, ఇటు జనసైనికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా పిఠాపురం, భీమవరం, అమలాపురం నియోజకవర్గాల అంతర్గత గ్రామాల్లో టీడీపీ-జనసేన లీడర్ల మధ్య నడుస్తున్న కోల్డ్ వార్ ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా రచ్చకెక్కుతోంది. పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని పల్లెల్లో ప్రెసిడెంట్ సీటు ఎవరిదనే దానిపై హోరాహోరీ పోరు సాగుతోంది. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ వేధింపులను తట్టుకుని, కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చిన స్థానిక టీడీపీ నేతలు.. ఎమ్మెల్యే సీటునే జనసేనకు త్యాగం చేశాం, కనీసం ఊరి సర్పంచ్ సీటైనా మాకు ఇవ్వకపోతే ఎలా అని గట్టిగా నిలదీస్తున్నారు. మరోవైపు, తమ అధినేత నియోజకవర్గం కాబట్టి మెజారిటీ గ్రామాలు తమకే దక్కాలని జనసైనికులు పట్టుబడుతుండటంతో అంతర్గత వర్గపోరు పీక్స్‌కు చేరింది. పశ్చిమ గోదావరి కేంద్రమైన భీమవరంలోనూ ఇదే తరహా



ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఏ గ్రామంలో ఏ పార్టీ వార్డు దక్కించుకోవాలి? ఎవరికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి? అనే అంశంపై ప్రతి ఊరిలోనూ రచ్చబండ పంచాయితీలు జరుగుతున్నాయి. ఉమ్మడి వేదికలపై పైకి నవ్వుతూ షేక్‌హ్యాండ్‌లు ఇచ్చుకుంటున్న స్థానిక నేతలు..లోపల మాత్రం ఎవరికి వారు గ్రూపు రాజకీయాలు నడుపుతున్నారు. ఒకరు పిలిచిన కార్యక్రమాలకు మరొకరు డుమ్మా కొట్టడం, లోకల్ వాట్సాప్ గ్రూపుల్లో పరోక్ష విమర్శలతో పోస్టులు పెట్టుకోవడం వంటి పరిణామాలు క్షేత్రస్థాయిలో అసంతృప్తికి అద్దం పడుతున్నాయి. అమలాపురం రూరల్ పరిధిలో సమీకరణాలు మరింత క్లిష్టంగా మారాయి. ఇక్కడ సామాజిక వర్గాల ఈక్వేషన్లు ఎప్పుడూ హాట్ టాపిక్కే. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ.. నిధుల కేటాయింపులు, గ్రామీణ పనుల కాంట్రాక్టుల విషయంలో టీడీపీ, జనసేన ద్వితీయ శ్రేణి నేతల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది.

# పీఎఫ్ ఖాతాదారులకు కేంద్రం శుభవార్త...




ఈపీఎఫ్‌వో పీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త అందిస్తూ రూ. 5 లక్షల వరకు ఆటో క్లెయిమ్ సెటిల్‌మెంట్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. పీఎఫ్ విత్‌డ్రా ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ ఈ కొత్త వ్యవస్థను కేంద్రం ప్రారంభించింది. ఎలాంటి జాప్యం లేకుండానే ఖాతాదారుల నగదు వెనక్కి వచ్చేలా సాంకేతికతను మెరుగుపరిచింది. దేశవ్యాప్తంగా ఉన్న ఖాతాలన్నింటినీ ఒకే కేంద్రీకృత డేటాబేస్ పరిధిలోకి తేవడం వల్ల ఈ ప్రక్రియ వేగవంతం అయ్యింది. దీనివల్ల సామాన్య ఉద్యోగులకు ఆర్థిక అవసరాల సమయంలో పీఎఫ్ డబ్బులు వెంటనే అందుతాయి. గతంలో పీఎఫ్ డబ్బులు తీసుకోవాలంటే అనేక దశల్లో ఆమోదాలు అవసరమయ్యేవి. ఇప్పుడు ఈపీఎఫ్‌వో కొత్తగా ప్రవేశపెట్టిన ఆటోమేటిక్ సెటిల్‌మెంట్ విధానం వల్ల ఇబ్బందులు తొలగిపోయాయి. రూ. 5 లక్షల వరకు ఉన్న క్లెయిమ్‌లు దరఖాస్తు చేసిన వెంటనే ఆటోమేటిక్‌గా ఆమోదం పొందుతాయి.

ఈ మార్పుతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. పారదర్శకమైన విధానం ద్వారా ఖాతాదారులకు వేగంగా సేవలందుతున్నాయి. పీఎఫ్ ఖాతాదారులకు మరొక కీలక అప్‌డేట్ అందుబాటులో ఉంది. జులై 15 నుండి ఖాతాదారుల నగదుపై వడ్డీని జమచేసే ప్రక్రియను ఈపీఎఫ్‌వో ప్రారంభిస్తోంది. ఈ నిర్ణయంతో లక్షలాది మంది ఉద్యోగుల ఖాతాల్లో వడ్డీ సొమ్ము నేరుగా చేరుతుంది. వడ్డీ పంపిణీకి సంబంధించిన అన్ని సాంకేతిక ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. పండుగ సీజన్లకు ముందుగా వడ్డీ సొమ్ము జమ అవ్వడం ఖాతాదారులకు పెద్ద ఊరటనిస్తుంది.

# ఎస్‌యూవీ, కమర్షియల్ వాహనాల ధరలు పెంచిన మహీంద్రా



దేశీయ దిగ్గజ వాహన తయారీ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) మరోసారి వాహనాల ధరలను పెంచుతూ వినియోగదారులకు షాకిచ్చింది. ఎస్‌యూవీ, కమర్షియల్ వాహనాలపై ధరలు పెంచినట్టు కంపెనీ వెల్లడించింది. సవరించిన ధరలు జూలై 10 నుంచి అమల్లోకి రానుండగా, ఎస్‌యూవీలపై 2.7 శాతం, కమర్షియల్ వాహనాలపై 2 శాతం వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

ముడి సరుకుల ధరలు పెరగడం వల్ల తయారీ వ్యయం భారంగా మారిందని, అందుకే కొంత మేర వినియోగదారులకు బదిలీ చేయాల్సి వచ్చిందని కంపెనీ తెలిపింది. అయితే అన్ని మోడళ్లపై ఒకే స్థాయిలో పెంపు ఉండదని, వాహనం, వేరియంట్‌ను బట్టి ధరల్లో మార్పు ఉంటుందని స్పష్టం చేసింది.

ఇదివరకు ఏప్రిల్‌లో కూడా మహీంద్రా తన ఎస్‌యూవీల ధరలను 2.5 శాతం, కమర్షియల్ వాహనాల ధరలను 1.6 శాతం వరకు పెంచిన సంగతి తెలిసిందే.

వాహన రంగంలో మహీంద్రా మాత్రమే కాదు, దాదాపు అన్ని కంపెనీలు పెంపు దిశగా అడుగులు వేస్తున్నాయి. కియా ఇండియా ఇప్పటికే జూలై 1 నుంచి అన్ని మోడళ్లపై 2 శాతం పెంచగా, టాటా మోటార్స్ కూడా మూడు నెలల్లో రెండోసారి ధరలను 1.5 శాతం వరకు సవరించింది. మారుతీ సుజుకీ జూన్ నుంచి కొన్ని మోడళ్లపై రూ. 30,000 వరకు, హ్యుందాయ్ రూ. 12,800 వరకు ధరలు పెంచాయి.

# 22ఏ భూముల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలు పక్కాగా పాటించాలి

## - ప్రభుత్వ భూముల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలి

## - రెవెన్యూ అధికారులతో సమీక్షలో కలెక్టర్ భవేష్ మిశ్రా





**నిజామాబాద్, సెప్టెంబర్ 02 ( ప్రజాగళం ప్రతినిధి)**నిషేధిత 22(ఏ) భూములకు సంబంధించిన అంశాలలో ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమగ్ర ఆధారాలు, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే సహేతుక నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి 22ఏ నిషేధిత భూముల జాబితాపై రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. 22ఏ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులు, భూముల రికార్డుల పరిశీలన, జాబితాలో చేర్చడం, తొలగింపు ప్రక్రియ తదితర అంశాలపై ఒక్కో మండలం వారీగా తహసీల్దార్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఏదైనా ప్రైవేట్ భూమి పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో నమోదైనట్లు నిర్ధారణ అయితే, సర్వే నంబర్ వారీగా డిలీటెడ్ లిస్ట్ రూపొందించి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. 22ఏ జాబితాలో భూములను చేర్చే సమయంలో అనుసరించే విధానాన్నే తొలగింపు ప్రక్రియలోనూ విధిగా పాటించాలని తెలిపారు. తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన కారణాలు, నిర్దిష్ట రిమార్క్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 22ఏ సమస్యలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలని హితవు పలికారు. నిషేధిత భూములకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు సమన్వయంతో పనిచేసి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని, సమగ్ర వివరాలతో నిర్ణీత ఫార్మాట్ లో నివేదికను రూపొందించి వెంటనే సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారఈ సమావేశంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ఈతవనాల పెంపుతో పర్యావరణ పరిరక్షణ

## - గీత కార్మికుల జీవనోపాధికి ఊతం

## - ఈత వనమహోత్సవంలో సత్యనారాయణ గౌడ్



**నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 2 (ప్రజాగళం )**పర్యావరణ పరిరక్షణకు ఈతవనాలు దోహదపడటంతోపాటు.. వాటిపై ఆధారపడే గీత కార్మిక కుటుంబాలకు జీవనోపాధిని అందిస్తున్నాయని కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నంబర్--2 అధ్యక్షుడు జి. సత్యనారాయణ గౌడ్ హితవు పలికారు. ఈత చెట్లను విస్తారంగా పెంచి సంరక్షించడంతో పచ్చదనాన్ని పెంచడమే కాకుండా గీత కార్మికుల సంప్రదాయ వృత్తికి అండగా నిలవచ్చని పేర్కొన్నారు. బుధవారం కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నంబర్--2, ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు జి. సత్యనారాయణ గౌడ్ నేతృత్వంలో ఈతవన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈత మొక్కలు నాటి, వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈత చెట్ల పెంపకం, సంరక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమానికి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నందగోపాల్, ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో స్వప్న, ఎస్సైలు మల్లేష్, గంగాధర్, మమతతోపాటు ఎక్సైజ్ సిబ్బంది హాజరయ్యారు. ఈతవనాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈత చెట్లు గీత కార్మికుల జీవనాధారంగా ఉన్నాయని, వాటి సంఖ్యను పెంచేందుకు మరిన్ని మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నాటిన మొక్కలను కేవలం కార్యక్రమానికే పరిమితం చేయకుండా అవి ఎదిగే వరకు సంరక్షించాలని సూచించారు. ఇప్పటికే ఉన్న ఈతవనాలను కాపాడటంతోపాటు కొత్త వనాలను అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈత చెట్లు పచ్చదనాన్ని పెంచడంతోపాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయని, మరోవైపు కల్లు గీత ద్వారా గీత కార్మిక కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని వివరించారు. అందువల్ల ఈతవనాల సంరక్షణను పర్యావరణ పరిరక్షణతోపాటు గీత కార్మికుల జీవనోపాధికి సంబంధించిన అంశంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఈతవనాల పెంపకం, సంరక్షణకు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నంబర్--2 డైరెక్టర్లు శ్రీహరి గౌడ్, బాలా గౌడ్, గంగాధర్ గౌడ్, దుర్గా గౌడ్‌తోపాటు సంఘం సభ్యులు, గీత కార్మికులు, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 48వ డివిజన్ ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## -మున్సిపల్ కమిషనర్‌కు ఆర్ఎస్పి పార్టీ వినతి



**నిజామాబాద్, సెప్టెంబర్ 2( ప్రజాగళం)**జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ 48వ డివిజన్ ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్పి ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్పి జిల్లా కార్యదర్శి కటారి రాములు మాట్లాడుతూ, నిజామాబాద్ నగరంలోని పాటిగల్లి పరిధిలోని 48వ వార్డు ప్రజలు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా పిచ్చికుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోందని, గతంలో ఒక చిన్నారిపై పిచ్చికుక్కలు దాడి చేసిన ఘటన జరిగినప్పటికీ మున్సిపల్ అధికారులు ఇప్పటివరకు శాశ్వత చర్యలు చేపట్టలేదని విమర్శించారు. అదేవిధంగా వార్డులో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని మురుగునీరు నిల్వ ఉండడంతో దోమల బెడద అధికమై ప్రజలు అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. మంచినీటి పైపులు పగిలిపోవడంతో మురుగునీరు తాగునీటిలో కలుస్తోందని, ఫలితంగా లార్వా, తోకపురుగులు కనిపిస్తూ దుర్వాసనతో కూడిన కలుషిత నీరు సరఫరా అవుతోందని తెలిపారు. దీంతో ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. 48వ వార్డు కార్పొరేటర్ ఎన్నికైన తర్వాత ఇప్పటివరకు స్థానిక సమస్యల పరిష్కారంపై కనీసం ఒక్కసారి కూడా స్పందించలేదని విమర్శించారు. వెంటనే పిచ్చికుక్కల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, డ్రైనేజీ వ్యవస్థను బాగుచేసి, దోమల నివారణ చర్యలు చేపట్టి, దెబ్బతిన్న మంచినీటి పైపులను మరమ్మతు చేసి స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్పి జిల్లా నాయకులు పిట్ల నరేష్, గోపాల్ సింగ్ ఠాగూర్, కాలనీవాసులు బాల ముకుంద్, నవీద్, లావణ్య, సంగీత, సూర్య పాల్, సునీల్, భూలక్ష్మి, నవనీత తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెకరేటరీగా శ్రీమతి నీలిమ ముద్దసాని

## - మర్యాదపూర్వకంగా కలిసిన కమ్యూనిటీ మీడియేటర్ మెంబర్స్



నిజామాబాద్, సెప్టెంబర్ 02, ప్రజాగళం:నిజామాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీగా సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి నీలిమ ముద్దసానిబాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఖూూూా ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ మీడియేటర్ మెంబర్స్ బుధవారం జిల్లా కోర్టు సముదాయం లోని ఖూూూా ఛాంబర్ లో జడ్జి ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ మీడియేటర్స్ రవీందర్ పటేల్, కుంచం శ్రీనివాస్, అబ్దుల్ అజీజ్ లు జడ్జి గారితో తాము కమ్యూనిటీ మీడియేటర్స్ గా చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. అలాగే గతంలో ఉన్న జడ్జీలు తమకు సహాయ సహకారాలు అందించిన విషయం గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఖూూూా సెకరెటరీ, సీనియర్ సివిల్ జడ్జి నీలిమ ముద్దసాని మాట్లాడుతూ జవీఎ ఓల్డ్ డీఈఓ ఆఫీస్ వాళ్లు చేస్తున్న కృషిని అభినందించారు. ప్రస్తుతం సమాజంలో కమ్యూనిటీ మీడియేటర్ వ్యవస్థ అవసరమన్నారు. ఈ వ్యవస్థను ఇంకా పటిష్టం చేసి సమస్యల పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. మంచి సమాజాన్ని తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చిన్న చిన్న విషయాలకే కుటుంబంలో కలహాలకు తావియొద్దని అలాగే ప్రతి ఒక్కరూ సర్దుకుపోయే గుణం అలవర్చుకున్నప్పుడు కుటుంబం, గ్రామం, పట్టణం, జిల్లా బాగుంటుందని అన్నారు.

# 22ఏ భూముల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలు పక్కాగా పాటించాలి

## -ప్రభుత్వ భూముల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలి

## -రెవెన్యూ అధికారులతో సమీక్షలో కలెక్టర్ భవేష్ మిశ్రా



**నిజామాబాద్, సెప్టెంబర్ 2 (ప్రజాగళం)**నిషేధిత 22(ఏ) భూములకు సంబంధించిన అంశాలలో ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమగ్ర ఆధారాలు, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే సహేతుక నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి 22ఏ నిషేధిత భూముల జాబితాపై రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. 22ఏ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులు, భూముల రికార్డుల పరిశీలన, జాబితాలో చేర్చడం, తొలగింపు ప్రక్రియ తదితర అంశాలపై ఒక్కో మండలం వారీగా తహసీల్దార్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఏదైనా ప్రైవేట్ భూమి పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో నమోదైనట్లు నిర్ధారణ అయితే, సర్వే నంబర్ వారీగా డిలీటెడ్ లిస్ట్ రూపొందించి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. 22ఏ జాబితాలో భూములను చేర్చే సమయంలో అనుసరించే విధానాన్నే తొలగింపు ప్రక్రియలోనూ విధిగా పాటించాలని తెలిపారు. తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన కారణాలు, నిర్దిష్ట రిమార్క్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 22ఏ సమస్యలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలని హితవు పలికారు. నిషేధిత భూములకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు సమన్వయంతో పనిచేసి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని, సమగ్ర వివరాలతో నిర్ణీత ఫార్మాట్ లో నివేదికను రూపొందించి వెంటనే సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎం ట్రేడర్స్‌పై అధికారుల మెరుపు. దాడి

## - 523 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

## - ట్రేడర్స్ యజమానులపై కేసు నమోదు



**నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 2 (ప్రజాగళం )**అక్రమంగా పిడిఎస్ బియ్యం నిల్వ ఉంచిన మిల్లు పై సివిల్ సప్లై అధికారులు బుధవారం మెరుపు దాడులు నిర్వహించారు. పక్కా సమాచారం మేరకు నవీపేట మండలం అనంతగిరి శివారులో గల ఎస్ఆర్ఎం ట్రేడర్ పై హైదరాబాద్ టాస్క్ ఫోర్స్, సివిల్ సప్లై అధికారులు, నవీపేట పోలీసులు మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ దాడిలో ఎస్ఆర్ఎం ట్రేడర్స్ లో 523 క్వింటాళ్ల అక్రమంగా నిలువ ఉంచిన పిడిఎస్ బియ్యాన్ని స్వాధీన పరుచుకున్నట్లు సివిల్ సప్లై డిప్యూటీ తాహసీల్దార్ పవన్ కుమార్ తెలిపారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం, చించోలి గ్రామంలోని అన్నపూర్ణ ట్రేడర్స్ నుంచి అక్రమంగా అనంతగిరి లోని ఎస్ ఆర్ ఎం ట్రేడర్స్ లోకి పిడిఎస్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. ఈ దాడిలో 523 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీన పరుచుకుని, ఒక డీసీఎం వాహనాన్ని సీజ్ చేశారు. ఎస్ ఆర్ఎమ్ ట్రేడర్స్ యజమాని శివప్రసాద్, అన్నపూర్ణ మిల్లు యజమాని హరికృష్ణ లపై కేసు నమోదు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ ఆర్ ఎం ట్రేడర్స్ లో పిడిఎస్ అక్రమ బియ్యం రవాణా పై ఇప్పటివరకు మూడు కేసులు నమోదు అయినట్లు పేర్కొన్నారు. మరో మారు ఇలాంటి చర్యలకు పాల్పడితే పిడియాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.. ఈ దాడిలో టాస్క్ డీఎస్పీ శేఖర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్ రావు, సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ రవి రాథోడ్, నవీపేట్ పోలీసులు పాల్గొన్నారు.

# పోలీస్ ఎన్నికల్లో ఆర్మూర్ సిబ్బందికి కీలక పదవులు.....

## - జిల్లా ప్రెసిడెంట్‌గా ఎర్రపాటి శ్రీనివాస్..

## - వైస్ ప్రెసిడెంట్‌గా యాసిర్ అరాఫత్.. - ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా శ్రీజ.. - శాలువా ఘనంగా సన్మానించిన ఆర్మూర్ ఎసిపి వెంకటేశ్వర రెడ్డి...



**ఆర్మూర్‌సెప్టెంబర్ 02: (ప్రజగళం)**నిజామాబాద్ జిల్లా పోలీసు ఎన్నికల్లో ఆర్మూర్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి కీలక పదవులు దక్కాయి. ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎర్రపాటి శ్రీనివాస్ జిల్లా ప్రెసిడెంట్‌గా, ఎస్సై యాసిర్ అరాఫత్ వైస్ ప్రెసిడెంట్‌గా, ఆర్మూర్ ఏసీపీ కార్యాలయంలో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీజ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గాఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారిని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ గౌడ్తో పాటు ఆర్మూర్ డివిజన్ పోలీస్ సిబ్బంది అభినందించారు. వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, తమ పదవుల్లో సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. జిల్లా పోలీసు ఎన్నికల్లో ఆర్మూర్ సిబ్బందికి ప్రాధాన్యత కలిగిన పదవులు లభించడం పట్ల పోలీసు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# జెన్ జీ టచ్ లో జనసేన!




**కాకినాడ:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జెన్ జీ యువత కేంద్రంగా రాజకీయ పరిస్థితులు మారుతున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన పార్టీని సైతం అదే ఆధునిక స్థాయిలో తీర్చిదిద్దాలని పవన్ గట్టిగా భావిస్తున్నారు. కేవలం పాత పద్ధతుల్లో కాకుండా మారుతున్న టెక్నాలజీ, సోషల్ మీడియా, సరికొత్త ఆలోచన విధానాలకు అనుగుణంగా పార్టీ యంత్రాంగాన్ని మార్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర అధికార ప్రతినిధుల కమిటీని రద్దు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 మంది నాయకులను వారి బాధ్యతల నుంచి తప్పించారు. నూతన నియామకాలు పూర్తి అయ్యే వరకు టీవీ డిబేట్లు, మీడియా సమావేశాలలో ఎవరూ పాల్గొనవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ సంస్థాగత ప్రక్షాళన దిశగా ఈ నిర్ణయం చాలా కీలకమైన అడుగుగా రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ సమూల మార్పులు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రకాశం అలాగే నెల్లూరు జిల్లాల కమిటీలను రద్దు చేసిన అధినాయకత్వం, పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా కొత్త కమిటీల బాధ్యతలను క్షేత్రస్థాయి క్యాడర్ కు అప్పగిస్తోంది. ఈ వరుస నిర్ణయాల కొనసాగింపుగానే ఇప్పుడు రాష్ట్రస్థాయి అధికార ప్రతినిధుల కమిటీని పూర్తిగా రద్దు చేయడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలలో జనసేనకు ప్రాతినిధ్యం వహిస్తున్న 26 మంది అధికార ప్రతినిధుల బాధ్యతలను హైకమాండ్ ఉపసంహరించుకుంది. కొత్త కమిటీల నియామకం జరిగే వరకు మీడియా ముందుకు వచ్చి మాట్లాడకూడదని కఠిన నిబంధనలు పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి పార్టీని పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయడమే ఈ ప్రక్షాళన ముఖ్య ఉద్దేశం. క్షేత్రస్థాయి నుంచి నాయకులను చురుగ్గా ఉంచడానికి ఈ కఠినమైన నిర్ణయాలు ఎంతగానో ఉపయోగపడతాయని పార్టీ భావిస్తోంది.జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి యువతకు ఎప్పుడూ పెద్దపీట వేస్తూ వస్తున్నారు పవన్ కళ్యాణ్.

# విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం వద్దు

## - సర్పంచ్ చల్ల గురవయ్య



**మునగాల ,సెప్టెంబర్ 2,నిఘానేత్రం** .మండల పరిధిలో గల బరాఖత్ గూడెం గ్రామ శ్రీనివాస్‌నగర్ కాలనీలో గల ప్రాథమిక పాఠశాలను గ్రామ సర్పంచ్ చల్ల గురువయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం దోమల బెడద అధికంగా ఉన్నందున పాఠశాల పరిసరాల్లో ఎక్కడా మురుగు నీరు నిలువ ,చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు నిల్వ ఉ ండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లనితెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ స్వయంగా రుచి చూసి నాణ్యతని పరిశీలించారు. భోజనం రుచికరంగా, నాణ్యతగా ఉండటంపై సిబ్బందిని అభినందించారు. పాఠశాలఅభివృద్ధి,విద్యార్థుల సంక్షేమం కోసం ప్రతిఒక్కరూ బాధ్యతతో,చిత్తశుద్ధితో పనిచేయాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.

# దుబాయ్‌లో ఆలూర్ వాసి మృతి...



**ఆర్మూర్‌సెప్టెంబర్ 2(ప్రజగళం)**ఆలూర్ మండల కేంద్రానికి చెందిన కచర్ల మోహన్ (40) దుబాయ్‌లో మృతి చెందారు. ఉపాధి నిమిత్తం గత పదేళ్లుగా దుబాయ్‌లో నివసిస్తూ జీవనం సాగిస్తున్న మోహన్.. మంగళవారం (ఆగస్టు 4) రాత్రి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులుతెలిపారు. మోహన్ మృతి వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు,బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదానికి గురయ్యారు. మృతుడికి భార్య కచర్ల రాణి, కుమారుడు గణేష్ ఉన్నారు.

# వేయ్యి రోజుల ప్రజాపాలన భేష్

## - సంక్షేమం--అభివృద్ధికి కాంగ్రెస్ సర్కారు పెద్దపీట

## - నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి



**నిజామాబాద్ రూరల్ సెప్టెంబర్ 2 (ప్రజాగళం )**వేయ్యి రోజుల ప్రజా పాలన భేషుగ్గా ఉందని నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు రేకులపల్లి భూపతిరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కారు సంక్షేమం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని వెల్లడించారు. ఈ మేరకు నిజామాబాద్ నగర శివారులోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 1000 రోజుల పాలనపై బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణకు తీవ్ర నష్టం జరిగిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా పూర్తిగా వైఫల్యం చెందారని ఆయన ఆరోపించారు. ప్రజల పక్షాన ప్రశ్నించని కేసీఆర్ రాజీనామా ఎందుకు చేయకూడదో సమాధానం చెప్పాలని అన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ 1000 రోజుల్లో 1 కోటి 24 లక్షల 40 వేలు జీతభత్యాలు తీసుకున్నారని అన్నారు.22 వేల కోట్లు ప్రభుత్వం కేసీఆర్ పై వెచ్చించిందన్నారు.బీఆర్ఎస్ ను ప్రజలు మర్చిపోయారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటుందని, ఇందులో భాగంగానే తెలంగాణకు నిధులు ఇవ్వడం లేదన్నారు.తెలంగాణను పునర్నిర్మిస్తామని చెప్పి కుటుంబ పాలన సాగించారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ప్రజాధనాన్ని భారీగా దుర్వినియోగం చేశారని, కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రజలకు ప్రయోజనం కలగలేదని ఎమ్మెల్యే ఆక్షేపించారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలు నిర్బంధ వాతావరణాన్ని ఎదుర్కొన్నారని, అలాంటి పరిస్థితుల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను తీసుకొచ్చిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒకవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే మరోవైపు రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని భూపతి రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 4 లక్షలకుపైగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణ దిశగా ముందుకు తీసుకెళ్లామని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ వంటి హామీలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.రైతుల సంక్షేమానికి రూ.1.68 లక్షల కోట్లకు పైగా కేటాయించామని, సుమారు రూ.25 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సుమారు రూ.70 వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందిస్తు్తన్నామని పేర్కొన్నారు.విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు ప్రాధాన్య తప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతు న్నామని చెప్పారు.విశ్వవిద్యాల యాలకు రెగ్యులర్ వైస్‌చాన్స్‌లర్లను నియమించడంతో ఉన్నత విద్యా వ్యవస్థను బలోపేతం చేశామన్నారు .నిరుద్యోగ యువతకు ఇప్పటివరకు సుమారు 70 వేల ఉద్యోగాలు కల్పించామని, రాష్ట్రానికి భారీగా విదేశీ పెట్టుబడులను తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కులగణనను దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణలో చేపట్టడం, ఎస్సీ వర్గీకరణను అమలు చేయడం, గిగ్ వర్కర్ల సంక్షేమానికి చట్టబద్ధమైన రక్షణ కల్పించడం వంటి నిర్ణయాలు సామాజిక న్యాయం దిశగా కీలక అడుగులని భూపతి రెడ్డి అన్నారు.

**రైజింగ్ తెలంగాణ దిశగా అడుగులు**

తెలంగాణను 2047 నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'రైజింగ్ తెలంగాణ' విజన్‌తో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. క్యూర్ ,ప్యూర్ , రేర్ వంటి బృహత్తర ఆలోచనలతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.తెలంగాణ తలసరి ఆదాయం రూ.4 లక్షలకు పైగా ఉందని, దేశ సగటుతో పోలిస్తే గణనీయంగా అధికంగా ఉందని పేర్కొన్నారు. కేంద్రం తెలంగాణ పట్ల వివక్ష చూపుతోందని ,తెలంగాణకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, పునర్విభజన చట్టం హామీల విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే ఆరోపించారు. రాష్ట్రం చెల్లిస్తున్న పన్నులకు అనుగుణంగా కేంద్రం నుంచి నిధులు రావడం లేదని అన్నారు.రాష్ట్రం నుంచి రూపాయి పన్ను చెల్లిస్తే అందులో కేవలం 42 పైసల మేరకు తిరిగి వస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులు, నిధులను అడ్డుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి ఆటంకాలు కల్పిస్తోందని విమర్శించారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి చేపడుతున్న పర్యటనలను కూడా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. హైదరాబాద్‌ను అక్రమ కబ్జాల నుంచి రక్షించేందుకు హైడ్రాను ఏర్పాటు చేశామని తెలిపారు.బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాల్సిన బాధ్యతను కేసీఆర్ నిర్వర్తించడం లేదని ఆరోపించారు. ప్రతిపక్ష నేత హోదాలో ప్రభుత్వ సౌకర్యాలను అనుభవిస్తూ ప్రజా సమస్యలపై మాత్రం స్పందించడం లేదని విమర్శించారు.ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ అసెంబ్లీలో ప్రజా సమస్యలపై తన వాణిని వినిపించాల్సి ఉండగా, సభకు పూర్తిస్థాయిలో హాజరు కావడం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజాధనంతో సౌకర్యాలు పొందుతూ ప్రజల కోసం పనిచేయని ప్రతిపక్ష నాయకుడు తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.పదేళ్ల పాలనలో రాష్ట్రంపై సుమారు రూ.9 లక్షల కోట్ల అప్పుల భారం మోపారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల్లో భారీ బకాయిలు పెట్టారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసి, ప్రజలపై అప్పుల భారాన్ని మోపి వెళ్లిపోయారని విమర్శించారు.ప్రజల్లో ఆదరణ కోల్పోయిన బీఆర్ఎస్ రాజకీయ మనుగడ కోసం రోడ్లపైకి వస్తోందని, చిల్లర రాజకీయాలకు పాల్పడుతోందనిభూపతి రెడ్డి విమర్శించారు. కుటుంబ అంతర్గత రాజకీయాలపై కూడా ఆయన విమర్శలు చేశారు.

# గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి

## - పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలి:

## - శాంతి కమిటీ సమావేశంలో సీపీ సాయి చైతన్య




**నిజామాబాద్ క్రైమ్ సెప్టెంబర్ 2 (ప్రజాగళం)** గణేష్ పండగ ఉత్సవాలను మతసామరస్యాలను కాపాడుతూ శాంతియుత వాతావరణం లో నిర్వహించుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు.గణేష్ చవితి పండుగను పురస్కరించుకొని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్ లో బుధవారం నిర్వహిం చారు. ఈ సమావేశానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య హాజరై గణేష్ ఉత్సవాల నిర్వహణ , భద్రతా ఏర్పాట్లు , శాంతిభద్రతలు , ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై శాంతి కమిటీ సభ్యులు , గణేష్ ఉత్సవాల నిర్వాహకులతో సమీక్షించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతమైన , సోదరభావంతో కూడిన శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. పండుగ అనేది ప్రజలందరినీ ఐక్యం చేసే కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకుంటూ మత సామరస్యాన్ని కాపాడాలని కోరారు.గణేష్ మండపాల నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతులు తీసుకోవడంతో పాటు , పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ తెలిపారు. మండపాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు , అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మండపాల వద్దకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ , పార్కింగ్ , జనసందోహం నియంత్రణకు నిర్వాహకులు ప్రత్యేకంగా సహకరించాలని తెలిపారు. మండపాల వద్ద డీజేలు , సౌండ్ సిస్టమ్‌ల వినియోగంలో ప్రభుత్వం నిర్దేశించిన శబ్ద పరిమితులు , సమయ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు.గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా కూడా నిర్వాహకులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని ముందుగా నిర్ణయించిన మార్గాలు , సమయాలను పాటించాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపులో పాల్గొనే వారు ఎలాంటి రెచ్చగొట్టే నినాదాలు , వివాదాస్పద చర్యలకు పాల్పడకుండా సంయమనం పాటించాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు , వదంతులను నమ్మవద్దని , ఏదైనా అనుమానాస్పద సమాచారం లేదా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కమిషనర్ సూచించారు. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు



విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని , గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా , సురక్షితంగా , విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని అవసరమైన భద్రతా చర్యలు చేపడుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా శాంతి కమిటీ సభ్యులు , గణేష్ మండపాల నిర్వాహకులు , ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించి మత సామరస్యాన్ని , శాంతిభద్రతలను కాపాడుతూ గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని పోలీస్ కమిషనర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సార్వజనీక కమిటీ యొక్క సూచనల ప్రతులను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ , నిజామాబాద్ టౌన్ సీ ఐ శ్రీనివాస్ రాజ్ , టౌన్ 1 ఎస్ హెచ్ ఓ రఘుపతి , 4 టౌన్ ఎస్.హెచ్.ఓ సతీష్ , నార్త్ సీ.ఐ శ్రీనివాస్, సౌత్ సీ ఐ సురేష్ , ఎస్.ఐ లు సార్వజని గణేష్ మండలి సభ్యులు , గణేష్ మండలి నిర్వాహకులు , ఆర్గనైజర్లు వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ ఎదుట గల్ఫ్ బాధితుల ఆందోళన

## - పరిస్థితి ఉద్రిక్తత, న్యాయం చేయాలంటూ డిమాండ్.



**ఆర్మూర్ సెప్టెంబర్ 2(ప్రజాగళం)**ఆర్మూర్ పోలీస్ స్టేషన్ వద్ద గల్ఫ్ బాధితుల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. గల్ఫ్ ఏజెంట్ నాగావత్ ప్రవీణ్ పై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు ఆందోళన దిగారు. ఏజెంట్ కారును అడ్డగించి, కారు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. పోలీస్ స్టేషన్ వద్ద గల్ఫ్ బాధితులు తమకు న్యాయం చేయాలంటూఆందోళన చేపట్టారు. ఇజ్రాయిల్ దుబాయ్ కి పంపిస్తామని చెప్పి మోసం చేశారన్నారు.

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం దస్తులాబాద్ గ్రామానికి చెందిన గల్ఫ్ ఏజెంట్ నాగవత్ ప్రవీణ్ పై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు డిమాండ్ చేశారు. గల్ఫ్ బాధితుల వద్ద నుండి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి ఫేక్ పర్మిట్ వీసా ప్రాసెసింగ్ చూపించి మోసం చేశాడని ఆరోపించారు. ప్రవీణ్ పై కేసు నమోదు కావడంతో అతని న్యాయవాది తీసుకు వెళ్లడంతో ఆందోళన గురైన గల్ఫ్ బాధితులు న్యాయవాది కాళ్లపై పడి మొరపెట్టుకున్నారు. గల్ఫ్ ఏజెంట్ పై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులను కోరారు.

# వేయ్యి రోజుల కాంగ్రెస్ పాలన అట్టర్ ఫ్లాప్

## - 420 హామీలపై బాకీ కార్డుల పంపిణీ

## - నిరసనలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా

**నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 2 ( ప్రజా గళం )**వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన పూర్తి అట్టర్ ఫ్లాప్ అయిందని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడిచినా 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజల జీవితాలను ఛిద్రం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిగాల గణేష్ గుప్తా కాంగ్రెస్ ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రభుత్వానికి పని చేసేందుకు సమయం ఇచ్చినా మార్పు రాకపోవడంతో, అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ నిరసనలో భాగంగా 420 హామీలతో కూడిన 420 అడుగుల భారీ ఫ్లెక్సీని ప్రజల ముందు ప్రదర్శించారు; ఈ నిరసనలు వారం రోజుల పాటు కొనసాగుతాయని బిగాల గణేష్ గుప్తా స్పష్టం చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కినందుకు సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పి, ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ఎగనామం పెట్టిన స్కీములు, నిధుల వివరాలతో కూడిన బాకీ కార్డులను 26వ డివిజన్ కోటగల్లిలో ఇంటింటికీ పంపిణీ చేశారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ప్రజల జీవితాలు ఛిద్రమయ్యాయని, ఎన్నికల హామీలను గాలికొదిలేసి రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజలను నిలువునా మోసం చేసిందని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.అధికారంలోకి రావడానికి ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు 1000 రోజులైనా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో కొత్తగా ఏర్పడిన ఏ ప్రభుత్వానికైనా పనిచేసేందుకు కొంత సమయం ఇవ్వాలనే సదుద్దేశంతో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఇన్నాళ్లూ వేచి చూశారని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రజలను నిరంతరం మోసం చేస్తుండటంతో ఇక చూస్తూ ఊరుకోబోమని, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని కేసీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారని తెలిపారు.ఈ పిలుపులో భాగంగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆధ్వర్యంలో నిజామాబాద్ లోని ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇస్తామని ఎగనామం పెట్టిన సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు రావాల్సిన డబ్బుల వివరాలను 'బాకీ కార్డు' రూపంలో రూపొందించారు.



నిజామాబాద్ బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సిర్ప రాజు ఆధ్వర్యంలో 26వ డివిజన్ పరిధిలోని కోటగల్లి ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి ఈ బాకీ కార్డులను పంపిణీ చేసి, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతూకిరణ్ శేఖర్,నగర అధ్యక్షులు సిర్ప రాజు,మాజీ నుడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, సత్య ప్రకాష్,నవీద్ ఇక్బాల్, జగత్ రెడ్డి,అబ్దుల్ మతీన్,బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు,డివిజన్ ఇంచార్జ్లు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# గుత్ప, అలీసాగర్ ఆయకట్టు పంటలను కాపాడండి

## - జిల్లాకలెక్టర్ కు బీజేపీ జిల్లా అధ్యక్షుడి వినతి



**నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 02: ( ప్రజాగళం )** గుత్ప, అలీసాగర్ ఆయకట్టు పంటలను కాపాడాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాకు బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా అలీసాగర్, గుత్ప లిఫ్ట్ ఆయకట్టు దిగువ ప్రాంతాలకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలనీ దినేష్ కులాచారి డిమాండ్ చేశారు.ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వర్షాలు సకాలంలో కురవకపోవడం, కురిసిన వర్షపాతం కూడా చాలా తక్కువగా ఉండటం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కురిసిన అరకొర వర్షాలపైనే ఆశలు పెట్టుకుని అన్నదాతలు జిల్లా వ్యాప్తంగా లక్ష ఎకరాల్లో వరి పంటను సాగు చేశారన్నారు.. ఎవర్షాభావ పరిస్థితుల కారణంగా సకాలంలో నీరు అందక రైతులు వేసిన వరి పంట ఎండిపోవడం జరుగుతుందన్నారు. భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయని.

దీనివల్ల బోరుబావుల్లో నీరు అడుగంటిపోయి, పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొందన్నారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా అలీసాగర్, గుత్ప (లిఫ్ట్) ఆయకట్టు దిగువ ప్రాంతాలకు సాగునీటిని తక్షణమే విడుదల చేస్తే, ప్రస్తుతం ఖరీఫ్ సాగులో ఉన్న వరి పంట ఎండిపోకుండా కాపాడుకోవచ్చని,ఈ నీటి విడుదల వల్ల భూగర్భజలాలు పెరిగి నాన్ కమాండింగ్ ఏరియాలోని బోర్లకు కూడా నీటి లభ్యత పెరిగి రైతులకు ఎంతగానో మేలు జరుగుతుందన్నారు., నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా అలీసాగర్, గుత్ప (లిఫ్ట్) ఆయకట్టు దిగువ ప్రాంతాలకు తక్షణమే సాగునీరు విడుదలయ్యేలా చర్యలు తీసుకుని అన్నదాతలను ఆదుకోవాలని కోరారు, లేనిపక్షంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. కలెక్టర్ ను కలిసిన వారిలో కార్పొరేటర్ ప్రమోద్, బీజేపీ నాయకులు పోతన్కర్ లక్ష్మీనారాయణ, అమంద్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# చేపూర్ కాంగ్రెస్ గ్రామ శాఖకు నూతన కమిటీ ఎన్నిక....

## - అధ్యక్షుడిగా బద్దం రాజు రెడ్డి....

## - ఉపాధ్యక్షుడిగా చిట్యాల పోశెట్టి.. ...

## - యూత్ అధ్యక్షుడిగా సుభాష్....

**ఆర్మూర్ సెప్టెంబర్: 02(ప్రజాగళం)**ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చేపూర్ సర్పంచ్ సారంగి శాంతికుమార్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు చిన్నారెడ్డి గారి సారథ్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా చేపూర్ గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడిగా బద్దం రాజు రెడ్డి, ఉపాధ్యక్షుడిగా చిట్యాల పోశెట్టి, యూత్ అధ్యక్షుడిగా సుభాష్ నియమితులయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బద్దం రాజు రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి, పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు కార్యకర్తలందరినీ సమన్వయంచేసుకుంటూ ముందుకు సాగుతానని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు,




కార్యకర్తలు దుబ్బాక రాము, శ్రీకాంత్, జేసీబీ మోహన్, మాజీ యూత్ అధ్యక్షులు బట్టు నవీన్, జొన్నపల్లి గంగాధర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గంగ సాయన్న, కటిక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com